ఉష్ణోగ్రత (అంచనా)

7-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	38	27
నరసరావుపేట	39	27
బాపట్ల	37	27
రెంటచింతల	39	27

షష్టిపూర్తి

- చరిత్రగా 60 ఏళ్ల శంకర్ విలాస్ ఆర్ఓబీ
- పెరిగిన ట్రాఫిక్‌కి బలహీనపడిన బ్రిడ్జి
- నూతన వంతెనకు కేంద్రం రూ. 98 కోట్లు మంజూరు
- నేడు శంకుస్థాపన చేయనున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రులు
- పనులు ప్రారంభమైన ఆర్నెల్లలో పాత బ్రిడ్జి కూల్చివేత



గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాలుగు తరాల ప్రజలకు సేవలందించిన శంకర విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి ఇక కనిపించదు. గుంటూరు ఒన్‌టౌన్ నుంచి టూటౌన్‌కు సులభతర ప్రయాణ వారిధిగా.. షష్టిపూర్తి చేసుకుని పూర్తిగా కనుమరుగు కానుంది. ఈ వెంతెన స్థానంలో నూతన హంగులతో నాలుగు వరసల రైల్ ఓవర్ బ్రిడ్జి రానుంది. బుధవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ చేతుల మీదగా నూతన బ్రిడ్జి నిర్మాణానికి పునాదిరాయి పడనుంది.

గుంటూరు - అమరావతి రోడ్డులో 500 మీటర్ల దూరంలోని ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి వద్ద గతంలో లెవల్ క్రాసింగ్ గేటు ఉండేది. రైళ్ల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవడంతో.. 1958 ఆగస్టు 4న అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి చేతుల మీదగా బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాటి మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్ ఎన్‌వీఎల్ నరసింహారావు, చీఫ్ ఇంజినీర్(హైవేస్) ఆంధ్రప్రదేశ్ ఎస్.దురాని హాజరయ్యారు. అప్పటి ఎస్ఎస్ఆర్ ప్రకారం రూ.8.37 లక్షల అంచనా విలువతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పెరిగిన వాహనాల రద్దీ కార ణంగా బలహీన పడిన ఈ బ్రిడ్జి స్థానంలో నూతన ఆర్‌వోబీని నిర్మించాలన్న ఆలోచన 2004 లోనే జరిగింది. అయితే ప్రతిపా దనలు ఫైళ్లకే పరిమితం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వం సేతుబంధన్ స్కీమ్ కింద నూత న ఆర్‌వోబీని మంజూరు చేసింది. అయితే పరిపాలన అనుమతులు, నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేసింది.

నేడు నిర్మాణానికి శంకుస్థాపన

సీఎం చంద్రబాబు చేతుల మీదగా ఈ చారిత్రక ఆర్‌వోబీకి శంకుస్థాపన చేయించాలని తొలుత భావించారు. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా సీఎం పర్యటన ఖరారు కాకపోవడంతో బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులే శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. సెయింట్ జోసఫ్స్ కళాశాల ఎదుట ఈ కార్యక్రమం జరగనుంది. గరిష్ఠంగా ఏడాదిన్నర వ్యవధిలో నూతన ఆర్‌వోబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమైన ఆరు నెలల తర్వాత పాత బ్రిడ్జిని కూల్చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ట్రాఫిక్‌ని వేర్వేరు మార్గాల్లోకి మళ్లించడం జరుగుతుందన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా కోల్పోయే 134 ఆస్తుల యజమానులకు నగర పాలక సంస్థ నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియని పూర్తి చేస్తోంది.

నూతన వంతెన నిర్మాణం ఇలా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో.. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శంకర్ విలాస్ ఆర్వోబీ ఈ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది దసరా పండగ సమయంలో రూ. 98 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆ తర్వాత డీపీఆర్ రూపకల్పన, స్టేక్ హోల్డర్స్ మీటింగ్‌లు జరిగాయి. ప్రస్తుత, రాబోయే మూడు దశాబ్దాల ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాలుగు వరసల బ్రిడ్జిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సెంట్రల్ డివైడర్, ఫుట్‌పాత్‌లు కలుపుకొని మొత్తం 21.550 మీటర్ల వెడల్పుతో 930 మీటర్ల పొడవునా బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. 23 అడుగుల వెడల్పుతో రెండు వైపులా సర్వీసు రోడ్లను నిర్మిస్తారు. బ్రాడీపేట నాల్గో లైను, అరండల్‌పేట ఐదో లైను, జీజీహెచ్ వద్ద అండర్ పాస్‌ల సదుపాయాలుంటాయి. ఉమెన్స్ కాలేజ్ జంక్షన్ నుంచి ఏసీ కళాశాల వైపునకు 100 మీటర్ల దూరంలో బ్రిడ్జి ప్రారంభమవుతుంది. దీని వల్ల అరండల్‌పేట వైపు నుంచి వచ్చే వాహనదారులు సులభతరంగా ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోకి వెళ్లిపోవచ్చు. ప్రస్తుత ఆర్‌వోబీ రైల్వేట్రాక్ కంటే 9 మీటర్ల ఎత్తుకు నిర్మిస్తున్నారు. అరండల్‌పేట వైపున 8 - 9 లైన్ల మధ్యన ఈ బ్రిడ్జి ప్రారంభవుతుంది.

నీటి సంఘాలు.. నిర్వీర్యం

ఉత్సవ విగ్రహాల్లా నీటి సంఘాల అధ్యక్షులు

- వారి అధికారాలను హరిస్తోన్న అధికారులు
- సమావేశాల ఏర్పాటుకు ఇష్టపడని జలవనరులశాఖ
- కాల్వల మరమ్మతులు.. నీటి పంపిణీలో భాగస్వామ్యం లేదాయే

నిధులు.. అధికారాలు లేవు

రైతులు ఏటా చెల్లించే నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ ప్రక్రియను అమలు చేసే పరిస్థితులు కానరావడంలేదని అధ్యక్షులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు నిర్దిష్టమైన అధికారాలను ప్రభుత్వం కల్పించినా వాటిని కొందరు హరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పైగా అధికారుల తీరు సంఘాలను అవమానించేలా ఉన్నాయన్న విమర్శలున్నాయి.



లింగంగుంట్లలోని జలవనరుల శాఖ కార్యాలయాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

◆ నీటి సంఘం సమావేశం నిర్వహిద్దామని ఓ డీసీ అధ్యక్షుడు ఓ అధికారిని కోరగా.. మొబైల్ ద్వారా మాట్లాడుతున్నారుగా. ఇక ప్రత్యేకంగా సమావేశంతో పనేముందని సమాధానం.

◆ సమావేశం గురించి మాట్లాడేందుకు ఓ నీటి సంఘం అధ్యక్షుడు ఓ అధికారికి ఫోన్ చేయగా.. బిజీగా ఉన్నాను.. తర్వాత మాట్లాడతాను.. అని సమాధానమిచ్చి ఇంతవరకు స్పందించలేదు.

◆ నీటి సంఘాల బాధ్యతలను చూసే ఓ అధికారిని సమావేశం గురించి ప్రశ్నిస్తే చూద్దాం లేండి.. అని సమాధానం.

..ఇదీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరు. అధికారుల సమాధానాలతో నీటి సంఘాల అధ్యక్షులు కంగుతింటున్నారు. అధికారుల తీరుతో నీటి సంఘాల బాధ్యులు ఆందోళన చెందుతున్నారు. అసలు తాము నీటి సంఘాల అధ్యక్షులమా కాదా.. తమకు అధికారాలు ఉన్నాయా లేవా.. అని అయోమయంలో ఉన్నారు. ఓ పథకం ప్రకారం నీటి సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళన ఎన్నికైన వారిలో వ్యక్తమవుతోంది. అధ్యక్షుల పరిస్థితి ఉత్సవ విగ్రహాల చందాన ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

కార్యాలయాలు అప్పగించలేదు

ప్రపంచ బ్యాంకు నిధులతో సాగర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు చాలా చోట్ల కార్యాలయాలు నిర్మించారు. ఆయా కార్యాలయాలను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అప్పగించాల్సి ఉంది. అయితే ఈ విషయాన్ని నెలలు గుడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు కాల్వల నిర్వహణలో, నీటి పంపిణీలో భాగస్వాములను చేయాలని సంఘాల అధ్యక్షులు కోరుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రాజెక్టుకు నీరు వస్తే జూలైలో నీటి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ లోగా కాల్వల మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉంది. ఏ కాల్వలో.. ఏ పనులు చేయాలనే విషయంలో సంఘాలకు పూర్తి అవగాహన ఉంటుంది. రైతుల ద్వారా సమస్యలు తెలుసుకుని పనులు చేపడితే సాగుదారులకు నీటి ఇబ్బందులు ఉండవు. అయితే ఈ దిశగా జలవనరుల శాఖ స్పందించడంలేదు. కనీసం నీటి సంఘాలతో సమావేశాలు నిర్వహించేందుకు కూడా సదరు అధికారులు ఇష్టపడటం లేదని పలువురు అధ్యక్షులు వాపోతున్నారు. నీటి సంఘాలను నిర్వీర్యం చేసేలా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందన్న విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా అధికారులు

సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఐదు నెలల క్రితం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. కాల్వల నిర్వహణ.. సాగునీటి పంపిణీలో సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతులకు దగ్గరగా ఉంటూ సాగు నీటి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు కాల్వల మరమ్మతులు, చివరి భూమి వరకు సాగునీటిని అందించడంలో కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వం సంఘాలకు సూ చించింది. ఇది నిజమే కదా అని ఆయా పనులు చక్కపెట్టేందుకు ప్రయత్నిస్తున్న సాగునీటి సం ఘాలకు జలవనరుల శాఖ అధికారుల నుంచి అవ మానాలే ఎదురవుతున్నాయని కొందరు అధ్యక్షులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల నిర్వహణ పనులను గుర్తించడం, నీటి తీరువా వసూళ్లలో నీటి సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాల ను జలవనరుల శాఖ తుంగలో తొక్కుతుందన్న విమర్శలున్నాయి.

కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత

పెనుగొండకు ఘన సన్మానం

వినుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో సోమవారం రాత్రి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఘనంగా సన్మానించారు. ముందుగా వినుకొండ పట్టణంలోని పలువురు కళాకారులు ఆయనను ఘనంగా ఊరేగించారు. అనంతరం శివయ్య, గంగినేని, జాషువా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా కళాప్రాంగణంలో అభి



పెనుగొండ లక్ష్మీనారాయణ దంపతులను సన్మానిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

నందన సభ ఏర్పాటు చేశారు. జీవీ ఆంజనేయులు పాల్గొని, మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు అందుకున్న పెనుగొండను రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో గౌరవించేందుకు తాను చొరవ తీసుకుంటానని తెలిపారు. పెనుగొండ మాట్లాడుతూ నాడు చెప్పులు లేకుండా తాను నడిచిన పుర వీధుల్లో నేడు కారులో ఊరేగించడం ఆనందంగా ఉందన్నారు. అందుకే తాను వినుకొండను మరువనని, తనను వినుకొండ మరువదని పేర్కొన్నారు. అభ్యుదయ కవి పులుపుల శివయ్య చిన్నవయసులో వేలుపట్టి బిడ్డగా నడిపించారని అందుకే ఆయన పేరుతో ఏటా సాహితీవేత్తలకు పురస్కారాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ పారా లక్ష్మయ్య, సీహెచ్ఎల్ఎన్ మూర్తి, పి.జె.లూకా, సీపీఐ నేతలు మారుతి వర ప్రసాదరావు, బొంకూరి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ షేక్ షకీలా, గీతాంజలి విద్యాసంస్థల ఛైర్మన్ ఎండ్లూరి శేషగిరిరావు, వినుకొండ బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సామగ్రి పక్కదారి.. విశ్రాంత ఏఈ అరెస్టు

పెదకూరపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు గృహ నిర్మాణ శాఖ ఏఈగా పనిచేస్తున్న సమయంలో రూ.47 లక్షల విలువైన ఇనుము, సిమెంట్ లెక్క అప్పగించని షేక్ పాషాను మంగళవారం పెదకూరపాడు పోలీసులు అరెస్టు చేశారు. గృహ నిర్మాణ శాఖ డీఈ సూర్య భగవాన్ గతేడాది జూన్ 23న 97 టన్నుల గృహ నిర్మాణానికి అవసరమైన ఇనుము, 230 బస్తాల సిమెంట్‌ను ఏఈ పాషా పక్కదారి పట్టించారని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వైసీహెచ్ అల్లూరిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయనను గుంటూరులో అరెస్టు చేశామని వివరించారు. గృహ లబ్ధిదారుల్లో ఒకే వ్యక్తికి ఇనుము రెండుమూడు సార్లు ఇచ్చినట్లు రికార్డుల్లో ఏఈ నమోదు చేశారని తెలిపారు. గృహ నిర్మాణశాఖ అధికారుల విచారణలో రెండుమూడు సార్లు తాము ఇనుము తీసుకోలేదని లబ్ధిదారులు చెప్పారు. అప్పటి నుంచి ఈ విశ్రాంత ఏఈ పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

● ప్రియుడు మృతి.. ప్రియురాలు క్షేమం ● యడ్లపాడు మండలం కొండవీడులో ఘటన ● కొడుకు మృతిపై తండ్రి అనుమానం

యడ్లపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు రెవెన్యూ పరిధిలో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో ప్రేమికుడు మృతిచెందగా.. తీవ్రగాయాలతో ఉన్న ప్రియురాలిని యువకుడి స్నేహితులు రక్షించారు. అయితే మృతుడి తండ్రి మాత్రం ఈ వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెం గ్రామానికి చెందిన కొర్నెపాటి మహేష్, కవిత కుమారుడు తేజ(19) చౌడవరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం పరశురామాపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం దాసరిపాలెం పరిధిలోని ఒక నూలు మిల్లులో పనిచేస్తూ.. గ్రామంలోనే నివాసం ఉంటోంది. సదరు కుటుంబానికి చెందిన యువతి కీర్తన అలియాస్ సమీరా, తేజ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమను ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. తేజ సోమవారం రాత్రి స్నేహితులు చందు, కోటితో కలసి కారులో బయటకు వెళ్లాడు. వారితో పాటు తెల్లవారు జామున కీర్తనతో కలసి కొండవీడు రెవెన్యూ పరిధిలో (చౌడవరం బాలకుటీర్ వెనుకనున్న)ని క్వారీ గుంత వద్దకు వెళ్లాడు. గుంత ఒడ్డున గల 50 అడుగుల కొండ పైకి చేరుకుని అక్కడి నుంచి ప్రేమి కులిద్దరూ క్వారీలోకి దూకారు. ఈ ఘటనలో తేజ నీటిలో మునిగిపోయి మృతిచెందగా.. కీర్తనను అక్కడికి చేరుకున్న స్నేహితులు రక్షించారు. గాయపడిన కీర్తనను గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. తేజ స్నేహితులు కోటి, చందు వీరిని క్వారీకుంట వద్ద వదలి వెళ్లారని, కొద్దిసేపటికి తేజ, కీర్తనల నుంచి ఫోన్ రావడంతో ఇద్దరూ తిరిగి క్వారీ గుంత వద్దకు వెళ్లగా.. కేకలు వేస్తూ ఉన్న కీర్తనను కాపాడారని పోలీసులు తెలిపారు. పెద్దలు వీరి ప్రేమను కాదనడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కథనాలు ఒక వైపు వస్తున్నప్పటికీ.. తేజ తండ్రి మహేష్, స్థానికులు మాత్రం అది ఆత్మహత్య కాదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని పోలీసుల దృష్టికి మహేష్ తీసుకెళ్లారు. పోలీసులు చందు, కోటిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, యడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ నేతృత్వంలో క్వారీ కుంటలోని నీళ్లను సాయంత్రానికి పూర్తిగా తోడించడంతో తేజ మృతదేహం బయటపడింది. పెద్దలు తమ ప్రేమను నిరాకరించినందు వల్లనే ప్రేమికులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారా.. లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.



కొర్నెపాటి తేజ (ఫైల్)



ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన క్వారీ గుంత

గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ గోనుగుంట్ల

గుంటూరు(తూర్పు), మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరాదరణకు గురవుతున్న గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృ భాషా వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంగళవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్ని, రాష్ట్ర సదస్సు చేసిన తీర్మానాలను వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధిపై కసరత్తు చేస్తున్నామని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చలపాక ప్రకాష్, పరుచూరి అజయ్ కుమార్, సీహెచ్ సుశీల, మోతుకూరి అరుణకుమార్, నానా, శ్రీవశిష్ట, ఎస్ఎం సుభాని ఉన్నారు.



కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వేదిక ప్రతినిధులు

తీర్పు ఆలసమైనా..అక్రమార్కులు తప్పించుకోలేరు

పొన్నూరుటౌన్, మే 6: అక్రమాలపై నమోదైన కేసుల్లో తీర్పు ఆలస్యం కావచ్చు కానీ, అక్రమార్కులు మాత్రం తప్పించుకోలేరని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం పేర్కొన్నారు. ఓబులాపురం మైనింగ్ కేసులో సీబీఐ కోర్టు తీర్పు.. మైనింగ్ మాఫియాకు చెంపపెట్టు అన్నారు. ఎంతటి రాబందులైనా.. ఒక్క తుపానుకు కూలిపోవాల్సిందేనన్నారు. ఓబులాపురం అక్రమ మైనింగ్‌పై 2004 నుండి 2009 వరకు టీడీపీ, తాము చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. అందుకు నేడు ఫలితం దక్కిందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి తనతో పాటు సహచర నాయకులు ఈ తీర్పును స్వాగతించినట్లు చెప్పారు. తీర్పు ఆలస్యం కావచ్చు కానీ, చట్టం చేతిలో నేరస్తులు తప్పించుకోలేరని ఈ తీర్పే ఉదాహరణ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



ఎమ్మెల్యే నరేంద్రకుమార్



రేషన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



దమ్మాలపాడు రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ శివాజీ


గుంటూరు సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేషన్ షాపుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని బొల్లవరం, దమ్మాలపాడు గ్రామాల్లోని రేషన్ షాపుల్లో స్టాక్‌ను పరిశీలించారు. సత్తెనపల్లిలోని మండల స్థాయి స్టాక్ పాయింట్‌లో రికార్డులు తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ పల్లపు శివాజీ మాట్లా డుతూ రేషన్ సరుకులను సరిగా ప్రజలకు పంపిణీ చేయాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల డైరెక్టర్ల నియామకం

▸▸ ఉత్తర్వు జారీ చేసిన ఇంధన శాఖ

అమరావతి, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ సంస్థల డైరెక్టర్లను నియమిస్తూ ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్‌గా టి.వెంకట సూర్యప్రకాశ్, డైరెక్టర్(ప్రాజెక్టు)గా టి.వనజ, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్)గా కాకర్ల గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్టు)గా కె.అయూబ్‌ఖాన్, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్)గా ఎ.మురళీకృష్ణయాదవ్, డైరెక్టర్ (ప్రాజెక్టు)గా టీవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఎస్.వెంకటేశ్వర్లు, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ (టెక్నికల్)గా జె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ (ఫైనాన్స్)గా నిష్టల వెంకటరమణ మూర్తి, ఏపీజెన్కో డైరెక్టర్ (ఫైనాన్స్)గా కె.సీతారామరాజు, డైరెక్టర్ (హెచ్ఆర్-ఐఆర్)గా మేము లాపల్లి ఉష, డైరెక్టర్ (హైడల్)గా ఎం.సుజయకుమార్, డైరెక్టర్ (కోల్ అండ్ లాజిస్టిక్స్)గా బమావత్తు నాగ్య, డైరెక్టర్ (థర్మల్)గా పి.అశోక్‌కుమార్‌ను నియమించారు.

ఏషియన్ పోటీలకు మహిళా లిఫ్టర్ల ఎంపిక



సాదియా అల్‌మాస్, నాగం జ్ఞానదివ్య, షేక్ షబీనా, షానూన్ మదిర

మంగళగిరి సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరా ఖండ్ డెహ్రాడూన్‌లో ఈ నెల 12వ తేదీ వరకు జరుగనున్న ఏషియన్ సబ్ జూనియర్స్, జూనియర్స్ క్లాసిక్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, ఏషియన్ యూనివర్సిటీ కప్ పోటీల్లో పాల్గొనే జాతీయ జట్టులో ఆంధ్రప్రదేశ్ తరపున గుంటూరు జిల్లా నుంచి నలుగురు మహిళా లిఫ్టర్లు ఎంపికయ్యారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలియజేశారు. జూనియర్ పవర్ లిఫ్టింగ్‌లో మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్‌మాస్ 57 కిలోల విభాగం, తెనాలికి చెందిన షేక్ షబీనా 84 కిలోల విభాగం, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్‌లో తెనాలికి చెందిన షానూన్ మదిర 53 కిలోల విభాగం, నాగం జ్ఞానదివ్య 84 కిలోలు పైబడిన విభాగంలో పోటీ పడుతున్నట్లు వెల్లడించారు. ఎంపికైన లిఫ్టర్లను సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

ఎస్సీ క్రైస్తవులను ఎస్సీ హిందువులుగా నమోదు చేసిన జగన్ సర్కార్

పొన్నూరుటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ కులాల నుంచి మారిన క్రైస్తవులను, చాలా మంది పాస్టర్‌లను జగన్ ప్రభుత్వం ఎస్సీ హిందువులుగా నమోదు చేసిందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ ఛైర్మన్, ప్రొఫెసర్ జోసెఫ్ మోసగంటి మంగళవారం ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ డేటా బేస్ నమోదు చేసిన సమయంలో ప్రజల వివరాలను అడగకుండానే కేవలం ఓటీపీ అడిగి సమాచారం నమోదు చేశారని ఆరోపించారు. ప్రజలు తాము పాస్టర్లమని, క్రైస్తవులమని చెప్పినప్పుడు క్రైస్తవ సర్టిఫికెట్ చూపించమని అడిగారన్నారు. కొంత మంది క్రైస్తవులుగా సర్టిఫికెట్‌లు చూపించినప్పటికీ హిందూ మతం నుంచి మారామని చెప్పినప్పుడు కూడా హిందువులుగా నమోదు చేశారని ఆరోపించారు. షెడ్యూల్ కులాల క్రైస్తవులు బీసీ-సీ కేటగిరీలోకి వెళ్లిపోతారని అన్నారు. వారిని కూడా ఎస్సీ హిందువుల కేటగిరిగా చూపిస్తే కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తాయని అలా చేశారని ఆరోపించారు. దీని మూలంగా జగన్ ప్రభుత్వం లాభపడింది కానీ, క్రైస్తవులు ఇరుక్కుపోయారన్నారు. జగన్ రెడ్డి క్రైస్తవ సమాజానికి మేలు చేయకపోగా ఘోరమైన అన్యాయం చేశారన్నారు. చర్చిలకు వెళ్లే పాస్టర్‌లు, షెడ్యూల్ కులాల వారు క్రైస్తవులుగా నమోదు చేయించుకోవాలంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని జోసెఫ్ మోసిగంటి సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు కౌన్సిల్ సమావేశం

● 320 అంశాలతో అజెండా సిద్ధం

గుంటూరు కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 320 అంశాలతో అజెండాను రూపొందించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, గత సమావేశాల్లో చర్చించిన అంశాల పరిష్కారంపై కార్పొరేటర్లు ఈ సమావేశంలో ప్రస్తావించనున్నారు. అనేక అంశాలపై చర్చించినా సమావేశాల్లో వాటి పరిష్కారానికి అధికారులు హామీ ఇస్తున్నారే తప్ప ఆచరణలో పెట్టడం లేదని కార్పొరేటర్లు వాపోతున్నారు. నగరంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. తాగునీటి సరఫరా కూడా అరకొరగా ఉంది.

పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణపై సచివాలయ ఎన్విరాన్మెంట్, ఎమినిటి కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. గుంటూరు నగరం అమరావతి రాజధాని ప్రాంతంలో భాగంగా ఉన్నందున, రాజధాని ప్రాంతానికి ఎంతో మంది వివిధ పనులపై వస్తుంటారని, వారు నగరానికి వచ్చే సందర్భంలో పారిశుధ్యం బాగా లేకపోతే గుంటూరు కార్పొరేషన్‌కు చెడ్డ పేరు వస్తుందన్నారు. కార్యదర్శులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తమ డివిజన్ల పరిధిలో తిరుగుతూ పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తూ పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కార్మికులకు ఉదయం 5 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుండి 6 గంటల వరకు సమయాన్ని నిర్దేశించుట జరిగిందన్నారు. సమావేశంలో డాక్టర్ అమృతం, ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, ఈఈలు సుదరరామి రెడ్డి, కోటేశ్వర రావు, ఎస్ఎస్‌లు, ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

కార్మికుల కుటుంబాలకు కార్పొరేషన్ అండ

● మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

కార్మికుల కుటుం బాలకు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, ఆర్థిక పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలి పారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్‌సోర్సింగ్ కార్మి కుడు సీహెచ్ చిన్న మాల్యాద్రి కుటుంబ సభ్యులు అంకమ్మకు ఎక్స్ గ్రేషియాకి సంబంధించి రూ.2 లక్షల చెక్‌ను మంగళవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో అందించారు. మట్టి ఖర్చులు రూ.15 వేలను ఇప్పటికే ఇచ్చామన్నారు. కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, మీరావలి, చిష్టి, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంహెచ్ఓ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

విధుల్లో నిర్లక్ష్యం, పారిశుధ్య పర్యవేక్షణ లోపంపై 8వ శానిటరీ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.రాంబాబుని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న తమ క్షేత్ర స్థాయి పర్యటనలో డివిజన్‌లో హాజరు రిజిస్టర్‌లో ముగ్గురు కార్మికులు హాజరు నమోదు చేసి ఉండగా, వారు విధుల్లో లేరని గుర్తించామన్నారు. విధుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యంగా ఉండడంతో సస్పెండ్ చేశామని తెలిపారు. ఇక్కడ ఇన్‌చార్జిగా ఎ.బాబుని నియమించామని చెప్పారు.

ఆహ్వాన పత్రిక రాద్ధాంతం..ఫ్లెక్సీ అసంతృప్తి

● శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి నేడు శంకుస్థాపన



ఏసీ కళాశాల ఎదుట శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : శంకర్‌విలాస్ నాలుగు వరసల నూతన ఆర్‌వోబీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ఇందుకోసం రోడ్లు, భవనాల శాఖ ఏసీ కళాశాల ఎదుట అంబేడ్కర్ భవన్ సమీపంలో శిలాఫలకం ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు చేసింది. అనంతరం బహిరంగ సభ కూడా జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. వీరితో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు హాజరవుతారని అధికారవర్గాలు తెలిపాయి.

కాగా, బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి ఆర్‌అండ్‌బీ శాఖ ఒక ఆహ్వాన పత్రికని రూపొందించి మంగళవారం వేల మందికి ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేసింది. ఈ ఆహ్వాన పత్రికలో ఏ ఒక్క ప్రజాప్రతినిధి/అధికారి పేరు లేదు. కేవలం ఆహ్వానించువారు సూపరింటెండింగ్ ఇంజినీరు, ఆర్‌అండ్‌బీ శాఖ గుంటూరు అని మాత్రమే పొందుపరిచారు. దీనిపై బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అంతా తానై నడిపించారు. జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నిధులు మంజూరు చేశారు. జిల్లా ప్రొటోకాల్ మంత్రిగా జనసేనకు చెందిన కందుల దుర్గేష్ ఉన్నారు. ఆహ్వానపత్రికలో బీజేపీ, టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులెవ్వరి పేర్లు లేవు.

ఈ ఆహ్వానపత్రంపై విమర్శలు రావడంతో మంగళవారం సాయంత్రానికి శిలాఫలకం నమూనాని విడుదల చేశారు. అందులో కేంద్ర మంత్రి పెమ్మసానితో పాటు ఎమ్మెల్యేలు, మేయర్, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్‌రెడ్డి, నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిప్యూటీమేయర్లు, కార్పొరేటర్లు, కలెక్టర్, కమిషనర్, ఆర్ అండ్ బీ ఎస్ఈ పేర్లని అందులో పొందుపరిచారు. ఏజెన్సీ పేరు లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ పేరుని కూడా చేర్చారు. కొంతమంది టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ నాయకులు వాళ్లని ప్రశ్నించి, అసంతృప్తి వ్యక్తపరిచారు.

అమరావతిలో ఏడు సంస్థలకు భూముల కేటాయింపు

● మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయాలకు సీఆర్డీఏ ఆమోదం

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కొత్తగా ఏడు సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ సీఆర్డీఏ అథారిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం సీఎం చంద్రబాబు వద్ద జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు కోర్ క్యాపిటల్ ఏరియాలో మొత్తం 71 సంస్థలకు 1050 ఎకరాల కేటాయింపులు జరిగాయి. వాటికి సంబంధించిన వివరాలను సచివాలయంలో మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. 2014-19 మధ్య కాలంలో అమరావతిలో 131 సంస్థలకు భూములు కేటాయించగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరిగి ఆయా సంస్థలతో పలుమార్లు సంప్రదింపులు జరిపామన్నారు. ఈ క్రమంలో వైదలగిన సంస్థలకు భూ కేటాయింపులు రద్దు చేసి కొత్తగా వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించి కేటాయింపులు చేస్తున్నామన్నారు. క్వాంటం వ్యాలీకి-50 ఎకరాలు, లా యూనివర్సిటీకి-50 ఎకరాలు, ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్‌కు 0.78 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి ఎకరం కేటాయించామన్నారు.

బసవతారకం క్యాన్సర్ ఫౌండేషన్‌కు గతంలో 15 ఎకరాలు కేటాయించగా, వైద్య కళాశాల నిర్మాణానికి ఇప్పుడు మరో 6 ఎకరాలను కేటాయించామన్నారు. కోస్టల్ బ్యాంక్‌కు 0.4 ఎకరాలు, రెడ్‌క్రాస్ సొసైటీకి-0.78 ఎకరాలు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల టవర్ల నిర్మాణం, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, మౌలిక వసతుల పూర్తికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. రాజధానిలో 190 ఎంఎల్డీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్ మెంట్ నిర్మాణానికి, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. జాతీయ రహదారులకు అనుసంధానం చేసేలా ఈ-13, ఈ-15 రోడ్లను పొడిగించేందుకు అథారిటీ నిర్ణయం తీసుకుందన్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డు ఈ-3లో 1.5 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదముద్ర వేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాస్

గుంటూరు(విద్య),మే 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కె శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రెవిన్యూ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ ఇడిగా డిప్యూటేషన్‌పై పనిచేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉంటే నూతనంగా ఇడిగా బాధ్యతలు చేపట్టిన కె శ్రీనివాస్ కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అమలు చేసే పథకాలు సమర్థవంతంగా లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నూతన ఈడీకి సూచించారు.



కలెక్టర్ నాగలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ నూతన ఈడీ శ్రీనివాస్

గుంటూరు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీగా పద్మావతి

గుంటూరు(విద్య),మే 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్(ఏపీసీ)గా ఇడవలపాటి పద్మావతిని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈమే మచిలీపట్నం ఉడా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు సమగ్రశిక్ష ఎపిసిగా డిఇవో సివి రేణుక అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాగాగా ప్రభుత్వం నూతన అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా నియమించింది. త్వరలో అమె బాధ్యతలు స్వీకరించనున్నట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.



సుగాలి కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

సుగాలి కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 43వ డివిజన్ సుగాలి కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. కాలనీలో మంగళవారం ఆమె కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, రెవెన్యూ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. బంజారా ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలు తమ నివాస స్థలాలకు బీ-ఫామ్ పట్టాలు, కమ్యూనిటీ హాల్ కావాలని కోరారన్నారు. ఇళ్ల పట్టాల విషయం అధికారులతో చర్చించగా అవి దేవదాయ శాఖకు చెందిన భూములుగా ఉన్నాయని తెలిసిందని, విషయాన్ని దేవదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె భరోసా ఇచ్చారు. ఆ ప్రాంతంలో వాగు ఆక్రమణలకు గురైందని, కాలువ మీద ఆక్రమణలు తొలగించి విస్తరణ చేపట్ట డానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాయి, శివ నారాయణ, మూల్పూరి పేరయ్య, తల్లాం శేఖర్ పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా అభివృద్ధికి కృషి చేస్తా

మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరు 35వ డివిజన్ పట్టాభిపురంలోని షాదీఖానా, ఇస్లామిక్ కౌన్సిల్ సెంటర్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు కమిటీల సభ్యులుగా ఇష్టానుసారంగా వ్యవహరించి ముస్లింల నుంచి అధిక మొత్తంలో వసూలు చేసి షాదీఖానాను దోచుకొని తిని, దాని నిర్వహణను గాలికి వదిలేశారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. షాదీఖానా అభివృద్ధికి సుమారు రూ.50 లక్షల పనులు ఉన్నాయని గుర్తించామన్నారు. వాటన్నిటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మాధవి హామీ ఇచ్చారు. షాదీఖానా వెనుక స్థలం ఆక్రమణ పై సమగ్ర విచారణ జరిపి భూమిని కాపాడుతామని, త్వరలోనే షాదీఖానా కమిటీని ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, షేక్ అబ్దుల్ రహీం, లాల్ వజీర్, రఫీ, చిన్న బాజీ, నాగూర్, సుభాని, రబ్బానీ, నజీర్, బుడే, మీరావలి, బాబు, అస్మా, రఫీ, సైదా పాల్గొన్నారు.

తెలుగింటి దైవం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

గుంటూరు(తూర్పు), మే 6 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానం ద్వారా భూత, భవిష్యత్తు, వర్తమానాల గురించి విశదీకరించిన తెలుగింటి దైవం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. స్థానిక అమరావతి రోడ్డు కొలువైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 332వ ఆరాధన మహోత్సవంలో ఆమె పాల్గొని పతాకావిష్కరణ గావించి శాంతి హోమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమస్త మానవాళి సౌభాగ్యాన్ని కాంక్షించే విశ్వబ్రాహ్మణులు ఐకమత్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి ఉమ్మడోజు నాగేశ్వరచారి మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన పర్వదినం సందర్భంగా బుధవారం పల్లకి సేవ, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దామచర్ల శ్రీనివాసరావు, అడక శ్రీనివాసరావు యాదవ్, పావులూరి హనుమంతరావు, అంగలకుదుటి సుశీల, కడియాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో కొన్నేళ్లుగా మూతపడి ఉన్న బాయిల్డ్ రైస్‌మిల్

- పదేళ్ల క్రితం ఓ వెలుగు వెలిగిన మిల్లులు
- వ్యాపారం లేక మూతపడిన వైనం
- ఇతర రాష్ట్రాల్లో ఏర్పాటుతో తీవ్ర పోటీ..
- పిడుగురాళ్లలో వెయ్యి మందికిపైగా ఉపాధి
- నేడు శిథిలావస్థకు.. తుప్పుపడుతున్న యంత్రాలు

బాయిల్డ్ రైస్ మిల్లులకు.. గ్రహణం



పిడుగురాళ్లలో పిచ్చి చెట్ల మధ్య శిథిలమవుతున్న బాయిల్డ్ యంత్రం

పిడుగురాళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో పిడుగురాళ్ల అంటే తెలియనివారు ఉండరు.. సున్నం పరిశ్రమలతో లైమ్ సిటీగా పేరొంది... బాయిల్డ్ రైస్ మిల్లుల రంగంలో ఒక ముద్ర వేసుకుంది. వేలాది మందికి ఉపాధి చూపిన బాయిల్డ్ రైస్ మిల్లులు నేడు వెలవెలబోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇక్కడ పదేళ్ల క్రితం వరకు 15 వరకు అతిపెద్ద బాయిల్డ్ రైస్ మిల్లులు పనిచేశాయి. రబీ సాగులో ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసి.. బాయిల్డ్ రైస్‌గా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు కేరళ, తమిళనాడుకు సరఫరా చేసే వారు. బాయిల్డ్ రైస్‌ను ప్రభుత్వం తీసుకోకపోవడం, వర్షాభావ ప్రభావం వల్ల పల్నాడు ప్రాంతంతో పాటు పలు ప్రాంతాల్లో రెండవ పంటగా వరి సాగు లేకపోవడంతో క్రమ క్రమంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు గ్రహణం పట్టింది.

ఇతర రాష్ట్రాల్లో బాయిల్డ్ రైస్ మిల్లులు..

సగం విరిగిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌కు ఉపయోగించే వారు. బోర్లు, బావులతో సాగునీరు పుష్కలంగా అందుతుండటంతో వరి ధాన్యం దిగుబడి నాణ్యత బాగుంటోంది. అవి బాయిల్డ్ రైస్‌గా ఉపయోగించేందుకు వీలుపడటం లేదు. కాలానుగుణంగా తూర్పు గోదావరి జిల్లా, తెలంగాణలోని మిర్యాలగూడలో విస్తారంగా బాయిల్డ్ రైస్ మిల్లులు ఏర్పడటంతో పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్ మిల్లులు వెనుకబడ్డాయి. ఒకప్పుడు పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్‌మిల్లులు పనిచేసిన సమయంలో పిడుగురాళ్ల, జానపాడుతో పాటు సమీప గ్రామాల్లోని పురుషులు, మహిళలకు ఒక్కో మిల్లులో రోజుకు 100 మంది వరకు ఉపాధి లభించేది. కేరళ, తమిళనాడులో కూడా అక్కడ రైతులు పండించిన ధాన్యాన్నే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఫలితంగా పిడుగురాళ్లలో ఒకప్పుడు కళకళలాడిన బాయిల్డ్ రైస్ మిల్లులు నేడు వెలవెలబోతున్నాయి. రూ.లక్షల ఖరీదు చేసే బాయిల్డ్ యంత్రాలు, మిల్లుల్లో సామగ్రి అంతా తుప్పుపడుతున్నాయి. ఆ యంత్రాలను మరొకరికి విక్రయించేందుకు వ్యాపారులు సిద్ధంగా ఉన్నప్పటికీ నేటి టెక్నాలజీకి అనుగుణంగా తయారైన యంత్రాలనే ఇప్పటి వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో.. భారీ యంత్రాలన్నీ నిరుపయోగంగా పడిఉన్నాయి.

ఆనాటి కళ ఇక రాదు

-కట్టమూరి శంకరరావు, వ్యాపారి



దాదాపు పదేళ్ల క్రితం రోజుకు వెయ్యి మందికి పైగా పిడుగురాళ్లలో ఉపాధి లభించే అవకాశం ఒక్క బాయిల్డ్ రైస్ మిల్లులకే ఉండేది. వ్యాపారులకు తగిన ఆదాయం, స్థానికులకు ఉపాధి చూపించామన్న సంతృప్తి ఉండేది. బాయిల్డ్ రైస్ మిల్లులు సమీప జిల్లా అయిన మిర్యాలగూడ, పొరుగు రాష్ట్రాలలో ఏర్పడటంతో క్రమ క్రమంగా పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్ మిల్లులన్నీ మూత పడ్డాయి.

సాగుకు పరీక్ష

వ్యవసాయరంగాన్ని నమ్ముకున్న రైతులకు నానాటికి పెట్టుబడులు పెరగడం తప్ప.. దిగుబడులు ఆశించినంత స్థాయిలో రావడంలేదు. ఫలితంగా నష్టాలబారిన పడటమా లేదా పెట్టుబడికి తగ్గ దిగ్గుబడితో సరిపుచ్చుకోవడమో జరుగుతుంది. అందుకు ప్రధాన కారణంగా పంట వేసే ముందు భూసార పరీక్షలు పూర్తి స్థాయిలో జరపకపోవడమేనని పలువురు వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



దుక్కు దున్ని ఉన్న పంటపొలం

- సకాలంలో నిర్వహించని భూసార పరీక్షలు
- వ్యవసాయశాఖ నిర్లిప్తతో రైతులకు నష్టం
- పెరుగుతున్న పెట్టుబడులు, దిగజారుతున్న దిగుబడులు
- పోషకాల లోపమే అంటున్న నిపుణులు
- తొలిదశలో గుర్తించకపోవడంతో.. అధికంగా ఎరువుల వినియోగం
- డెల్టాలో ఖరీఫ్, రబీలో వేర్వేరు పంటల సాగు
- ప్రస్తుతం దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

తెనాలిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాంతంలో అధికంగా రైతు కుటుంబాలే తరతరాల నుండి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఇందులో ఎక్కువగా నిరక్షరాస్యులే ఉండటం విశేషం. ఈ ప్రాంతంలో ఏడాదికి రెండు పంటలు పండే వీలుంది. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి, జొన్న, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తుంటారు. గతంలో ఎకరాకు 40-50 బస్తాలకుపైగా ధాన్యం పండేది. రాను రాను దిగుబడులు తగ్గి.. పెట్టుబడులు పెరిగాయి. యూరియా, డీఏపీ వంటి ఎరువులు గతంలో తక్కువగా వినియోగిస్తేనే పంటల ఎదుగుదల చక్కగా ఉండేది. ఎరువుల వాడకం పెరడంతో.. దిగుబడి తగ్గడంతో పాటు చీడపీడల వ్యాప్తికూడా పెరుగుతోంది. ఇందుకు ప్రధానంగా భూమిలో పోషకలోపాలను తొలిదశలోనే గుర్తించకపోవడమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సాగుకు ముందే భూసార పరీక్షలు తప్పనిసరి

దుక్కి సమయంలో సాగు భూమి మధ్య నుండి కొంత మట్టిని నమూనాగా తీసుకుని.. దానిని సాలిడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపాలి. అప్పుడే భూమిలోని పోషక లోపాలు, విలువలు గుర్తించడంతో పాటు పంటల సాగుకు అనువైన విత్తన రకాలనూ తెలుసుకొనే అవకాశం ఉంటుంది. పోషక లోపాలు గుర్తిస్తే.. నివారణకు అవసరమైన చర్యలు చేపట్టవచ్చు. గతంలో జింక్ లోపాన్ని గుర్తించి.. నివారణకు అధికంగా జింక్‌ను రైతులు వినియోగించారు. ప్రస్తుతం సాగు పూర్తిచేసుకున్న రైతులు దుక్కులు దున్ని.. భూములు పదును పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి నుంచే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించి, శాంపిల్స్ పరీక్షలు చేయించి, లోపాలను తెలుసుకోవాలి. రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించాలి.

రైతు సేవా కేంద్రాల్లో భూసార పరీక్షలు..

రైతు సేవా కేంద్రాల వద్దే భూసార పరీక్షలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఎప్పటికప్పుడు పరీక్షలు జరిపి లోపాలను వెంటనే తెలిపే అవకాశం ఉంటుంది. దీని ద్వారా తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపడితే రాబోయే పంట సాగుకు పూర్తిగా పెట్టుబడులు తగ్గడంతో పాటు అనువైన విత్తనాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది.

తూతూ మంత్రంగా భూసార పరీక్షలు

గత వైసీపీ ప్రభుత్వంలో భూసార పరీక్షలు తూతూ మంత్రంగానే జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి.. సేవలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంచిందన్న విమర్శలున్నాయి. వ్యవసాయానికి ప్రధాన భూమిక పోషించే సాలిడ్ టెస్ట్‌లను ఆర్బీకేల్లో ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు భూసారం గురించి తెలుసుకునేందుకు అవకాశం తక్కువగా ఉండేది. సాగు సమయం ఆసన్నమయ్యే సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది హడావుడి చేసి స్వల్ప సంఖ్యలోనే శాంపిల్స్ తీసుకునే వారని రైతులు చెబుతున్నారు. వాటిని జిల్లా సాలిడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపేవారని..ఫలితాలు వచ్చేసరికి సాగుపనులు కూడా ప్రారంభమయ్యేవని అంటున్నారు. దీంతో పరీక్షలకు మట్టి తీసుకున్నా రైతాంగానికి మేలు జరిగిందేమిలేదన్న విమర్శలున్నాయి.

చిక్కడు, దొరకడు.. చిన్నోడు!

● నియోజకవర్గాన్ని విడిచి పరారై సంవత్సరం ● అజ్ఞాతంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు ● అన్న జన్మదిన వేడుకల్లో ప్రత్యక్షం



మాచర్లటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో టెర్రరైజ్ చేసి, అన్నీ తానై అన్నను మించి షాడోగా సాగించుకున్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి (చిన్నోడు) నియోజకవర్గానికి మొహం చాటేసి సంవత్సరం కావొస్తోంది. మాజోలికి వచ్చే దెవరు.. మాజోలికొచ్చి తట్టుకునేదెవరూ అంటూ ప్రగల్భాలు పలికిన వ్యక్తి.. తెలంగాణలో తలదాచుకొని వ్యాపారాలు చేసుకుంటూ.. ఆదాయాన్ని గడిస్తున్నాడు. పాపం ఆయనను నమ్ముకున్న చోటా మోటా నాయకులు, కార్యకర్తలు కొంతమంది జైలుపాలు కాగా, మరికొంతమంది ఇతర రాష్ట్రాల్లో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు.

హౌస్ అరెస్ట్ నుంచి పరారై..

ఎన్నికల పోలింగ్, మరుసటి రోజు జరిగిన దాడుల్లో గతేడాది మే 14న పోలీసులు మాచర్లలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల కన్నుగప్పి అర్ధరాత్రి వేళ పీవీఆర్ పరారై నేటికి సుమారు ఏడాది కావొస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మాచర్ల నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. తనను నమ్ముకున్న కార్యకర్తలకు కూడా తాను ఎక్కడ ఉన్నాడో చెప్పకుండా అజ్ఞాత జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. తన ఆధిపత్యంలో సహకరించిన నాయకులు, కార్యకర్తలు కొంతమంది జైలుపాలు కాగా, మరికొంతమంది నియోజకవర్గం విడిచి పొరుగు రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డిని ఎన్నికల్లో ఓడిపోతే నియోజకవర్గం వదిలిపెట్టి పోతాడని తూలనాడిన వెంకట్రామిరెడ్డి... నేడు వైసీపీ అధికారం కోల్పోవడంతో మాచర్ల నియోజకవర్గంలోకి అడుగు పెట్టడానికి కూడా సాహసం చేయలేకపోతున్నాడు. అంగ బలం, అర్ధబలంతో తనపై నమోదైన కేసులన్నింటిపై కోర్టుకెళ్లి బెయిల్ పొందగలిగాడు. నమ్ముకున్న వారు మాత్రం డబ్బుల్లేక, కుటుంబ పోషణ భారమై నరకయాతన పడుతున్నారు.

పోలీసులు ఉదాసీన వైఖరితో..

ఈ మధ్యన విడుదలైన పుష్ప-2 సినిమాలో.. హీరో దమ్ముంటే పట్టుకోరా షికావత్ అంటూ.. పోలీసు ఆఫీసర్‌కు సవాల్ విసిరే సన్ని వేశం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మాచర్లలో అదే స్థాయిలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పలు కేసుల్లో నిందితుడు అయినప్పటికీ పోలీసులకు చిక్కకుండా సవాల్ విసురుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరినా..వెంకట్రామిరెడ్డి వ్యవహారంలో మాచర్ల పోలీసులు ఉదాశీనత వైఖరిని అవలంబించారని విమర్శలు వస్తున్నాయి. గత ఫిబ్రవరి 15న తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో మొదటి సారిగా ప్రత్యక్షమయ్యాడు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక వ్యాపారాలు చేసి, కూడబెట్టుకున్న ఆస్తులతో పోలీసులు తన జోలికి రాకుండా చేసుకోవడంలో ఆయన విజయవంతం కాగలిగాడు.

12 కేసుల్లో నాలుగు 307 సెక్షన్లు..

- గతేడాది మే 13న సాధారణ ఎన్నికల ఓటింగ్ జరిగింది. ఆ సమయంలో పోలింగ్ బూత్‌ల వద్ద దాడులు చేయడం, మరుసటి రోజు కారంపూడిలో కార్యకర్తలతో టీడీపీ కార్యాలయం, నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారు. అడ్డుకున్న సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి, గాయపరచడం వంటి పలు కేసుల్లో 12 కేసులు నమోదయ్యాయి. ఇందులో నాలుగు 307 సెక్షన్ కింద కేసులు నమోదయ్యాయి.
- 2022 డిసెంబరు 16న మాచర్ల పట్టణంలో టీడీపీ కార్యాలయం, నాయకుల గృహాలు ధ్వంసం, కార్లకు నిప్పు పెట్టడం వంటి కేసుల్లో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై 307 కేసు నమోదైంది. ఎన్నికల ఓటింగ్ రోజున వెల్దుర్తి మండలం కండ్లకుంటలో ఏజెంట్‌గా కూర్చున్న నోముల మాణిక్యంను బెదిరించిన కేసులో ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదు చేశారు.
- అదే రోజు పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి గృహంపై దాడి చేసి, ధ్వంసం చేయడంతో పాటు సుమారు 12 మంది కార్యకర్తలను కారుతో ఢీకొట్టి గాయపరిచారు. వాహనాలను ధ్వంసం చేయడంతో 307 నమోదైంది.
- 2014లో మాచవరం మండలం చెన్నాయపాలెంలో సరస్వతీ సిమెంట్స్‌కి భూములు ఇచ్చిన రైతులపై దాడి కేసులో 307తోపాటు ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడిగా వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సహకరించాలి

● గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులతో ఎంపీ కృష్ణప్రసాదు



స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో పాల్గొన్న బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాదు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి తదితరులు

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు కొత్తగా(గ్రీన్ ఫీల్డ్) నాలుగు వరసల రోడ్డు నిర్మాణానికి సంబంధిత ప్రభుత్వ శాఖలు సహకరించాలని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాదు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఈ హైవే ప్రాజెక్టుపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన గుంటూరు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి, గుంటూరు జేసీ ఎ.భార్గవ్ తేజ, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్ర వర్మ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్ట్ వరకు కొత్తగా (గ్రీన్‌ఫీల్డ్) నాలుగు వరసల హైవేని 47.848 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధిత కేంద్రమంత్రులతో అనేక దఫాలు చర్చించి, వారిని ఒప్పించి ప్రాజెక్టుని మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయితే సూర్యలంక, చీరాల బీచ్‌తో పాటు అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలు, పొన్నూరులోని వీరాంజనేయ స్వామి దేవస్థానం పర్యటకాభివృద్ధి చెందుతా యన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు అన్ని అనుమతులు పొందిన తర్వాత ఆరు నెలల్లో భూసేకరణ, 18 నెలల్లోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చే యాలని తన ఆకాంక్షను తెలిపారు. స్టేక్ హోల్డర్స్ అయిన ఆర్‌అండ్‌బీ, విద్యు త్, ఇరిగేషన్, రైల్వే, ఫిషరీస్, అగ్రికల్చర్, పంచాయతీ రాజ్, దేవదాయ, అటవీశాఖ అధికారులు తమ శాఖలకు సంబంధించి ఏవైనా అంశాలు ఉంటే పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని కలెక్టర్లు నాగ లక్ష్మి, జె.వెంకట మురళి ఆదేశించారు. వాటిని క్రోడీకరించి ప్రాజెక్టు రిపోర్ట్‌ను నేషనల్ హైవే అథారిటీకి పంపి, రోడ్డు నిర్మాణానికి అనుమతులు కోరడం జరుగుతుందన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు నిర్మాణాన్ని వివరించారు. ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు అధికారి పార్వతీశం, డీఆర్‌ఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీపీఓ నాగసాయికుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రులు అనగాని, గొట్టిపాటి, ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్ర



బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, గల్లా మాధవి

పౌరుషానికి ప్రతీక ఒంగోలు జాతి ఎడ్లు

● ఎడ్ల బల ప్రదర్శనలో రాష్ట్ర మంత్రులు

పొన్నూరుటౌన్. మే 6(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి పౌరుషానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీక అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ జాతీయస్థాయి వృషభరాజాల బల ప్రదర్శన పోటీలు మంగళవారం జరిగాయి. రాష్ట్ర మంత్రులు నాదెండ్ల, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, పలువురు ప్రజా ప్రతినిధులు పోటీలను ప్రారంభించి రైతులను సన్మానించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో 9 జతల ఎడ్లు 1,600 కిలోల బండ లాగుడు పోటీల్లో తలపడ్డాయి. ఈ సందర్భంగా సభలో మంత్రులు మాట్లాడుతూ.. భారీ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన రాష్ట్రానికే ఆకర్షణగా మారిందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ఆశయాలతో సంగం డెయిరీని మరో మెట్టు ఎక్కించి రైతులకు మేలు చేస్తున్నారని కొనియాడారు. వైసీపీ పాలకులు డెయిరీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్ని, ఇబ్బందులకు గురిచేసినా.. జైలు జీవితం ఎదుర్కొన్నారే కానీ, దుర్మార్గాలకు లొంగలేదన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజు, విజయనగరం మాజీ ఎమ్మెల్యే గంపా కృష్ణ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, బీజేపీ అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

9 వరకే మిర్చి యార్డులో లావాదేవీలు

● సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ చంద్రిక

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా మిర్చి యార్డుకు ఈ నెల 12వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీల యూనియన్లు, చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. యార్డులో 9వ తేదీ శుక్రవారం వరకే మిర్చి లావాదేవీలు జరుగుతాయన్నారు. శని, ఆదివారాలు యార్డుకు సెలవుదినాలని పేర్కొన్నారు. జూన్ 9 నుంచి యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని తెలిపారు. రైతులు 8న సాయంత్రం నుంచి సరుకుని యార్డుకు తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక హెల్ప్‌లైన్

గుంటూరు(విద్య),మే 6(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. జిల్లాల వారీగా ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, అభ్యర్థుల సందేహాలు నివృత్తిచేయనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు 95733 82626, 92467 63763లో సంప్రదించాలని పేర్కొంది.

ఇంజనీరింగ్ అధికారులపై..

క్రమశిక్షణ చర్యలు

● నరుకుళ్లపాడు మేజర్ కాలువ పనుల్లో నాణ్యత లోపం ● విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమగ్ర నివేదిక ● ప్రాథమిక ఆధారాలను గుర్తించిన జలవనరుల శాఖ

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని నరుకుళ్లపాడు మేజర్ కాల్వ పనుల్లో నాణ్యత లోపంపై జలవనరుల శాఖ ప్రాథమిక ఆధారాలను గుర్తించింది. ఇందుకు బాధ్యులైన అధికారులపై శాఖపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. తాడికొండ నియోజకవర్గం పరిధిలో జరిగిన ఈ పనుల విషయంలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈఈ, ఏఈఈల పాత్ర ఉన్నట్లు అంచనాకు వచ్చింది. వీళ్లల్లో కొందరు వేరే జిల్లాల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తుండగా.. ఒకరిద్దరు రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ క్యాడర్‌కు వెళ్లిపోయారు. అయినప్పటికీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైతే మేజర్ పెనాల్టీలు కూడా విధించేందుకు ప్రొసీడింగ్స్ జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ఆయా అధికారుల్లో ఆందోళన మొదలైంది.

నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆధునికీకరణ పనులు ఉమ్మడి రాష్ట్రంలో పెద్దఎత్తున చేపట్టారు. కాల్వల వెడల్పు, గట్ల బలోపేతం, కొత్త రెగ్యులేటర్లు, వంతెనలు నిర్మించడం వంటి అనేక పనులు చేశారు. నరుకుళ్లపాడు మేజర్ కాల్వ పనులను తాడికొండ నియోజకవర్గంలో అప్పటి ఈఈ జి.వాసంతి (ప్రస్తుతం తెలంగాణలోని బాన్సువాడ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ), డీఈఈ అనురాధ(కురిచేడు సబ్ డివిజన్ మానిటరింగ్ డీఈఈ), ఏఈఈ సీహెచ్ చిన్నరాణి(ముప్పాళ్ల), డీఈఈ టీ రమేష్(వీపీ సబ్ డివిజన్ నంబరు 2 గుంటూరు), ఏఈఈ కె.రామకృష్ణ(ఎన్ఎస్‌జేసీ ఓఅండ్ఎం సెక్షన్ నకరికల్లు), ఈఈ పీవీఎస్‌వీ ప్రసాదరావు (రిటైర్డు), ఈఈ ఎంవీ కృష్ణారావు(రిటైర్డు), ఇన్‌చార్జి ఈఈ ఎంఎస్‌వీకేఎస్ రాంప్రసాదు (రిటైర్డు), ఈఈ బీఎస్‌వీ ప్రసాదరావు(రిటైర్డు) పర్యవేక్షించారు.

పనులు జరిగిన కొన్ని నెలల్లో అవి శిథిలం కావడంతో ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పనుల్లో నాణ్యత లోపాన్ని ధ్రువీకరించి, వాటిని ఎవరెవరు పర్యవేక్షించారనే వివరాలను సేకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేశారు. ఈ నివేదికను జలవనరుల శాఖ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం.. అధికారుల పర్యవేక్షణ లోపంపై ప్రాథమిక ఆధారాలున్నట్లుగా నిర్ధారించుకుంది. శాఖపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు మంగళవారం జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పశ్చిమ డెల్టాకు 716 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపశ్చిమ డెలాక్టు ప్రకాశం బ్యారేజి నుంచి 716 క్యూసెక్కులనీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లె కాల్వకు 110, తూర్పు కాల్వకు 50, నిజాంపట్నం కాల్వకు 45, కొమ్మమూరు కాల్వకు 469 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 823 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,000, గరిష్టధర రూ.11,250, మోడల్‌ధర రూ.10,800 పలికాయి. కాయ కనిష్టధర రూ.10,000, గరిష్టధర రూ.11,250, మోడల్‌ధర రూ.10,800 పలికాయి.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వెంకటస్వామి

పెదనందిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బీ వెంకటస్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన శివశంకర్‌రావు మాతృ సంస్థకు బదిలీపై వెళ్లారు. కాకుమాను తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటస్వామికి పెదనందిపాడు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం వెంకటస్వామిని డీటీ కరీముల్లా, సర్వేయర్ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, పలు రాజకీయ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలసి అభినందలు తెలియజేశారు.

శైవ క్షేత్రంలో శివపాదుకల ప్రతిష్ఠ

తుళ్లూరు(తాళ్లయపాలెం), మే 6 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్ తుళ్లూరు మండలం తాళ్లయపాలెం శైవక్షేత్రాన్ని మంగళవారం సందర్శించారు. శివస్వామి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మో రక్షతి రక్షితః ట్రస్టు సభ్యులు, శ్రీశైవక్షేత్ర శిష్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో అలోక్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీశైవక్షేత్ర ఆత్మలింగ ఆలయంలోని ధర్మ సింహాసనం మీద శివపాదుకలని ప్రతిష్ఠ చేశారు. శైవ క్షేత్రాన్ని సందర్శించిన వారిలో యక్కలి రాఘవులు, రవికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల నిరసన

పెదనందిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం వైద్య సిబ్బంది నల్ల రిబ్బన్‌లను ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎంఎల్‌హెచ్‌పీ అనుచిత వ్యాఖ్యలు చేయడం వలన వైద్యఆరోగ్య సిబ్బంది మనోభావాలు దెబ్బతిన్నాయని అహంకార పూరిత వ్యాఖ్యలు మానుకోవాలని వారికి కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు గురించి మాట్లాడాలని, డిమాండ్‌ల పై ప్రభుత్వాలే పట్టించుకోవాలే కానీ తోటి సిబ్బంది ఉన్నతాధికారులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబుకాదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కమలాకర్‌రావు, సీహెచ్‌సీ ప్రసాద్‌స్వామి, సూపర్‌వైజర్ చెన్నయ్య, ఏఎన్ఎం జ్యోతి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు అకుంఠిత దీక్ష అవసరం

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
● పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు(విద్య), మే 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గుంటూరు జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా విద్యాశాఖ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేశారని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. మంగళవారం సాయంత్రం కలక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో 580పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. అత్యధిక మార్కులు సాధించిన 34 మంది విద్యార్థుల ను, వారి తల్లిదండ్రులను కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి విద్యార్థి దశ నుంచి ఐఏఎస్ వరకు తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. 2025 పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 4వ స్థానం సాధించిందని, వచ్చే సంవత్సరం జిల్లాను మొదటి స్థానంలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జేసీ ఎ.భార్గవ్ తేజ, జిల్లా విద్యా శాఖాదికారి సి.వి.రేణుక, అసిస్టెంట్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ కె.వెంకట రెడ్డి, ఉప విద్యాశాఖాధికారులు ఏసురత్నం, శాంతకుమారి, ఎంఈవో ఖుర్దూస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఖాసీం పాల్గొన్నారు.

వేధింపులు తట్టుకోలేక హత్య చేశాం

పేరేచర్ల హత్య కేసులో నిందితుల అరెస్టు

మేడికొండూరు మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరేచర్ల గ్రామంలో గత నెల 27న జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి, మంగళవారం గుంటూరు కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. వారికి కోర్టు రిమాండ్ విధించింది. హతుడు మంగళగిరికి చెందిన ఇట్టా బాలకృష్ణ (35) వేధింపులు తట్టుకోలేకే తాము హత్యకు పాల్పడినట్లు ఆరుగురు నిందితులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు. మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ కథనం ప్రకారం.. మంగళగిరికి చెందిన ఇట్టా బాలకృష్ణ అనే వ్యక్తి తన దూరపు బంధువులైన మంగళగిరికే చెందిన మొగిలి మధు అలియాస్ మాధవ్, మొగిలి గణేష్, ఫిరంగిపురం గ్రామానికి చెందిన మేడా అశోక్, కాకుమాను మండలం బల్లకట్టువాని పాలేనికి చెందిన పాలపర్తి సాంబయ్య, త్రిపురాంతకానికి చెందిన బెల్లంకొండ తిరుపాలతో కలిసి వివిధ ప్రాంతాల్లో పంది మాంసం విక్రయిస్తుంటారు. గత నెల వీరంతా పందులు విక్రయించిన సొమ్ముతో.. పేరేచర్ల శివారు రైల్వే ట్రాక్ పక్కన ఉన్న మామిడి తోటకు వెళ్లి మద్యం తాగారు. నగదు విషయమై వీరి మధ్య వివాదం మొదలైంది. ఎక్కడ వ్యాపారం చేసినా తమకు.. అన్యాయం చేస్తున్నావంటూ బాలకృష్ణను మిగిలిన వారు నిలదీశారు. ఈ వివాదం పెరిగి బాలకృష్ణపై దాడికి పాల్పడ్డారు. గాజు సీసాలతో పొడిచి, బండరాళ్లతో కొట్టి హత్య చేశారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బాలకృష్ణ తీవ్ర గాయాలతో కొద్ది సేపటికి మరణించాడు. పేరేచర్ల వీఆర్వో వెంకటేష్ ఫిర్యాదు ఆధారంగా గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే వీరి గొడవను ఒకరు దూరం నుంచి సెల్ ఫోన్‌లో వీడియో తీశారు. దానిని పోలీసులకు అందజేశాడు. వీడియో ఆధారంగా నిందితులను పోలీసుల గుర్తించారు.

వైభవంగా వింజనంపాడులో సిడిమాను మహోత్సవం


వైభవంగా సాగుతున్న సిడిమాను ఊరేగింపు

వట్టిచెరుకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజనంపాడు గ్రామంలోని గ్రామ దేవతలుగా కొలుచుకొనే పోలేరమ్మ, అద్దంకమ్మ తిరునాళ్ళ మహోత్సవంలో ప్రధాన ఘట్టమైన సిడిమాను మహోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. తొలుత సిడిమానుకు మొక్కుబడిగా ఇచ్చిన సిరి పోతును కనక తప్పెట్లు, మాతంగి కన్య సహకారంతో ఆలయ పెద్దలు సిరిపోతు దాత దేవాలయానికి తీసుకువచ్చారు. అనంతరం సిరిపోతును సిడిమానుకు అగ్రభాగాన ఏర్పాటు చేసిన ఇనుప జల్లెడలో ఉంచి అనంతరం మాతంగి కన్య అనుమతితో సిడిమాను ఉత్సవం గ్రామ వీధుల్లోకి బయలుదేరగా నీటితో వార్లు పోస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాళ్ళ సందర్భంగా ఉదయం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి పెనుగాలులతో కూడిన వర్షం కొంత ఆటంక పరిచినప్పటికీ సవ్యంగా నిర్వహించుకున్నారు.

దళిత రాజధాని అమరావతిపై జగన్ కక్ష

● మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): దళిత రాజధాని అమరావతిపై జగన్ రెడ్డి కక్ష కట్టారని, అధికారంలో ఉన్నప్పుడు భ్రమరావతి అని ప్రచారం చేసిన జగన్ రెడ్డి దాన్ని ధ్వంసం చేశారని, ఇప్పుడు అమరావతి పనుల పునఃప్రారంభం జరిగితే తన చెత్త పత్రికలో వేదనలో రాజ్యం.. వేడుకలో రాజధాని అంటూ చెత్త వార్తలు రాస్తున్నారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దేశంలోనే ఉత్తమ రాజధానిగా అమరావతిని నిర్మించబోతున్నారన్నారు.

50 శాతం సబ్సిడీపై దాణా కట్టలు పంపిణీ

● పశు వైద్యాధికారి ఏరువా రాయపరెడ్డి

తాడికొండ, మే 6(ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు 50 శాతం సబ్సిడీపై దాణా కట్టలను పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యాధికారి ఏరువా రాయపరెడ్డి మంగళవారం తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. నియోజకవర్గానికి 25 మెట్రిక్ టన్నుల దాణా వచ్చిందన్నారు. తాడికొండకు 5 టన్నులు, పొన్నెకల్లుకు 5, రావెల, ఫిరంగిపురం, నుదురుపాడుకు ఐదేసి టన్నుల చొప్పున దాణా అందుబాటులో ఉందన్నారు. రూ.1110లు విలువ చేసే దాణా కట్ట లు సబ్సిడిపై రూ.555లకు 50 కేజీల బస్తా ఇవ్వనున్నట్లు తెలిపా రు. పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి

ఫిరంగిపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన జరిగే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ కోరారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ వద్ద జరిగిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. కార్మిక వర్గాన్ని తిరిగి బానిసత్వంలోకి నెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ పరం చేశారన్నారు. ధరల పెరుగుదల కార్మిక వర్గపు ఆర్థిక పరిస్థితిని బాగా దెబ్బతీసిందన్నారు. నుదురుపాడు మెడికల్ అధికారికి సమ్మె నోటీసును ఆయన అందజేశారు.

వీఆర్ఏలకు పెంచిన డీఏను కొనసాగించాలి

● సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకరరావు

తాడేపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏలకు పెంచిన డీఏను కొనసాగించాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులతోపాటు డీఏ అందజేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రాతూరు ప్రభాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో రూ.300 ఉన్న డీఏను రూ.500వరకు పెంచారన్నారు. ఆ పెంచిన డీఏను ఆరు నెలలు ఇచ్చి తర్వాత ఆపేశారని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నైట్ వాచ్‌మన్ విధులు నిర్వహించరాదని, జీవో ఇచ్చారని తెలిపారు. కాగా 2024 సంవత్సరం నుంచి తహసీల్దార్ కార్యాలయాల వద్ద నైట్ వాచ్‌మన్ విధులు నిర్వహించాలని మళ్లీ ప్రభుత్వం ఆదేశించడంతో ఖర్చులు భాగంగా మారాయని అన్నారు. తమని నైట్ వాచ్‌మన్ విధుల నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో వీఆర్ఏ నుంచి రూ.10వేలు కట్టించుకున్నారని, ఆ నగదు తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

మోతడక చలపతికి ఎన్‌బీఏ అక్రిడిటేషన్


ఎన్‌బీఏ అక్రిడిటేషన్ పత్రాలతో చలపతి విద్యా సంస్థల కరస్పాండెంట్ సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాసరావు

మోతడక(తాడికొండ), మే 6(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలకు మూడు సంవత్సరాల కాలవ్యవధితో రెండో సారి ఎన్‌బీఏ అక్రిడిటేషన్ మంజూరైనట్లు కళాశాల కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మోతడక ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ పత్రాలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌బీఏకు చెందిన ఎక్స్‌పర్ట్ కమిటీ ఫిబ్రవరి 15వ తేదీన కళాశాలను సందర్శించినట్లు తెలిపారు. కళాశాలలోని వసతులు, పాటిస్తున్న విద్యా ప్రమాణాలు, జరుగుతున్న పరిశోధన, అభివృద్ధి విషయాలు, అధ్యాపకుల ప్రమాణాలు, సంస్థలో పాటిస్తున్న టీచింగ్ పద్ధతులు పరిశీలించినట్లు తెలిపారు. నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ సూచించిన అన్ని విషయాలను తూ.చ తప్పకుండా విద్యా సంస్థల్లో పాటిస్తున్నందుకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ రెండోసారి మంజూరు చేసినట్లు తెలిపారు. కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు తీసుకురావటానికి కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీనివాసరావు, అకడమిక్ డీన్ ఫణికుమార్, డీన్ పీ బాలమురళీకృష్ణ, డీన్ వీవీ సుబ్బారావు, కే జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం బకాయి వేతనాలు చెల్లించాలి

తాడికొండ, మే 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం శ్రామికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబవరి నుంచి ఉపాధి పని చేసే శ్రామికులకు వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. చేసిన పనికి వేతనాలు రాక అప్పుల పాలవుతున్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి శ్రామికుల బకాయిలకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సమ్మర్ అలవెన్సును 30 శాతం ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో చనిపోయిన వారికి రెండు లక్షలు, గాయపడిని వారికి లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

నేడు బుడంపాడు సబ్‌స్టేషన్ ప్రారంభం

గుంటూరు మే 6 (ఆంధ్రజ్యోతి): మొత్తానికి బుడంపాడు సబ్‌స్టేషన్ ప్రారంభానికి ముహూర్తం కుదిరింది. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చేతుల మీదుగా బుధవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. గుంటూరు టౌన్ - 1 డివిజన్ పరిధిలోని సదరు సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేసి దాదాపు ఆరు నెలలు పూర్తయినప్పటికీ విద్యుత్ శాఖ యంత్రాంగం నిర్లక్ష్యం చేయడంపై ఇప్పటికే అనే విమర్శలు వచ్చాయి. సబ్‌స్టేషన్ ప్రారంభానికి నోచుకోని వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో గతంలో కథనాలు కూడా ప్రచురితమైన విషయం తెలిసిందే. 33/ 11 కేవీ సామర్థ్యం కలిగిన ఈ సబ్‌స్టేషన్ ప్రారంభంతో గుంటూరు రూరల్ ప్రాంతంతోపాటు అనేక ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించనున్నారు.

విద్యను అందించిన దేవాలయాన్ని తీర్చిదిద్దుకుందాం

● ఎన్‌ఆర్‌ఐలు త్రిపురనేని సోదరులు


ఎన్‌ఆర్‌ఐ త్రిపురనేనిని సన్మానిస్తున్న హెచ్‌ఎం, అధ్యాపకులు

వట్టిచెరుకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యను అందించి ఉన్నత శిఖరాలకు చేర్చిన దేవాలయాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత తమతో పాటు పూర్వ విద్యార్థులు పంచుకోవటంపై ఎన్‌ఆర్‌ఐ సోదరులు గారపాడు హైస్కూల్ పూర్వ విద్యార్థులు త్రిపురనేని రవి, భాస్కర్‌లు హర్షం వ్యక్తం చేశారు. మండ లంలోని గారపాడు గ్రామంలోని బీకేఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్‌ఆర్‌ఐ సోదరులు పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.60 లక్షల వ్యయంతో నూతనం గా రెండు గదులు, విశాలమైన ఆడిటోరియం నిర్మాణం జరుగుతున్న పనులను మంగళవారం ఎన్‌ఆర్‌ఐలు త్రిపురనేని సోదరులు రవి, భాస్కర్‌లు స్వయంగా స్థానిక పెద్దలు అధ్యాపకులతో కలసి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం, ఇంకా ఏమైనా అవసరమైన మౌలిక సదుపాయల కోసం ఏం చేయాలనే విషయాల గురించి హైస్కూల్ హెచ్‌ఎం జీవీబీ వెంకటరావు, స్థానిక పెద్దలు పూర్వ విద్యార్థి తాటి వీరయ్య, గ్రామ సర్పంచ్ సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి అధ్యాపకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐలను సన్మానించారు.

వరగానిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వేడుకలు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెదనందిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగానిలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వరగానిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరిగి మూడేళ్ల అయిన సందర్భంగా స్వీట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలలో ఎన్టీఆర్ చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటప్పయ్య, గ్రామ అధ్యక్షుడు చెన్నుపాటి సురేంద్ర, శివనాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాంబాబు, బుల్లి సాంబయ్య, పూర్ణచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోదండ రామ స్వామి బ్రహ్మోత్సవాలు

వట్టిచెరుకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి పల్లపాడు గ్రామంలోని కోదండ రామ స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి స్వామి వారి పవళింపు సేవతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం పూర్ణాహుతి, శిఖర దర్శనం, చక్ర స్నానం, కుంభాభిషేకం, వేద పండితుల మంత్రోచ్చారణతో వైభవంగా నిర్వహించుకున్నారు.

పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తాడేపల్లి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈదురు గాలులు, అకాల వర్షం ఫలితంగా నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. తాడేపల్లి పరిధిలో దెబ్బతిన్న పంట పొలాలను సీపీఐ నేతల బృందంతో కలిసి మంగళవా రం ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రభు త్వం చెబుతున్న లెక్కల ప్రకారం 15వేల ఎకరాల్లో వరి, మొక్క జొన్న వంటి పంటలకు నష్టం జరిగిందని అలాగే మరో 2వేల ఎకరాలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని స్వయానా ప్రభుత్వ మే లెక్కలు చెప్పిందన్నారు. సీఎం చంద్రబాబు 24 గంటల్లో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, రైతుల ను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ప్రకటించారు. కనీసం ఆయన నివాసం ఉంటున్న తాడేపల్లి పరిధిలో తీవ్రంగా పంటలు నష్టం జరిగితే ఏ ఒక్క అధికారి వచ్చి, ఇప్పటివరకు పంటలను పరిశీలించకపోవడం ఏంటని ప్రశ్నించారు. అలాగే పౌరసఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ రైతు ల దగ్గర నుంచి తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నామన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్న మాటలకు, గ్రౌండ్ లెవల్‌లో జరుగుతున్న పనులకు ఎటువంటి పొంతన లేదని అన్నారు. ప్రభు త్వం వెంటనే స్పందించి పంట నష్టపోయిన ప్రాంతాలకు అధికారులను పంపించి నష్టాన్ని అంచనా వేయించి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, తుడిమెల్ల వెంకటయ్య, ముసునూరు సుహాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు 100రోజుల పనిదినాలు కల్పించాలి


పెదకొండూరులో పంటకాల్వ పూడికతీత పనులకు వచ్చిన కూలీల సమస్యలను తెలుసుకుంటున్న వ్య.కా.స జిల్లా కార్యదర్శి బాలరాజు

దుగ్గిరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలందరికీ 100 రోజుల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. పెదకొండూరులో జరుగుతున్న ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను బాలరాజు కలిసి మంగళవారం మాట్లాడారు. బాలరాజు మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు చెల్లిస్తామన్న రూ.307 అమలు చేయడంలేదని, ఎండలో ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకూ పనిచేస్తున్నామని, మజ్జిగ, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. వేతనాలు సకాలంలో చెల్లించి, రోజుకూలీపై జీవించే ఉపాధికూలీలను ఆర్థిక ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సంసోను, నాగరాజు, మరియమ్మ పలువురు వ్య.కా.స నాయకులు, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి

● ఏపీజీఏఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా

ఫిరంగిపురం, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జూన్ నెలలో నిర్వహించే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీజీఏఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా అన్నారు. మంగళవారం ఫిరంగిపురం తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలపై ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆహ్వానించి వినతిపత్రం ఇవ్వనున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, ఇంటీరియం రిలీఫ్ తక్షణమే విడుదల చేయాలని, కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తదితర అంశాలపై సీఎంకు తెలియ జేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఫిరంగిపురం తాలూకా యూనిట్ అధ్యక్షులు కొండపల్లి సుదర్శనరాజు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువలా పోలేరమ్మ తిరునాళ్ల

పెదనందిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిపాడులో పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం కన్నుల పండువలా జరిగింది. అమ్మవారికి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం శిడిమాను మహోత్సవం గ్రామ పురవీధుల్లో సాగింది. మహిళలకు వార్లు పోసి పూజలు చేశారు. మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

పెదనందిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులపాడులో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ఉత్సవమూర్తులను కమిటీ సభ్యులు దేవాలయ ప్రాంగణంలో ఊరేగించి అనంతరం స్వామికి అర్చకులు త్రినాథ్ శర్మ పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ ఛైర్మన్ సాంబశివరావు పర్యవేక్షించారు.

మద్యం మత్తులో పరస్పర దాడి

దుగ్గిరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): పాతగొడవల నేపథ్యంలో మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం, పరస్పర దాడికి కారణమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈమనికి చెందిన వట్టెం శివనాగ రాజు అదేగ్రామానికి చెందిన ఆవుల బాజిల మధ్య సోమవారం రాత్రి స్థానిక పెట్రోలు బంక్ సమీపంలో వాగ్వాదం జరిగింది. గొడవ పెద్దదై ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. గాయపడిన ఇద్దరు తెనాలి ప్రభుత్వవైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం ద్వారా, శివ నాగ రాజు ఫిర్యాదు మేరకు ఆవుల బాజి, మరో వ్యక్తిపైన కేసు నమోదుచేయగా, బాజి ఫిర్యాదు మేరకు శివనాగరాజుపైన కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు.

అమరావతిలో ఏడు సంస్థలకు భూముల కేటాయింపు

● మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయాలకు సీఆర్డీఏ ఆమోదం

అమరావతి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో కొత్తగా ఏడు సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ సీఆర్డీఏ అథారిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం సీఎం చంద్రబాబు వద్ద జరిగిన సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు కోర్ క్యాపిటల్ ఏరియాలో మొత్తం 71 సంస్థలకు 1050 ఎకరాల కేటాయింపులు జరిగాయి. వాటికి సంబంధించిన వివరాలను సచివాలయంలో మంత్రి నారాయణ మీడియాకు వివరించారు. 2014-19 మధ్య కాలంలో అమరావతిలో 131 సంస్థలకు భూములు కేటాయించగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరిగి ఆయా సంస్థలతో పలుమార్లు సంప్రదింపులు జరిపామన్నారు. ఈ క్రమంలో వైదొలగిన సంస్థలకు భూ కేటాయింపులు రద్దు చేసి కొత్తగా వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించి కేటాయింపులు చేస్తున్నామన్నారు. క్వాంటం వ్యాలీకి-50 ఎకరాలు, లా యూనివర్సిటీకి-50 ఎకరాలు, ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్‌కు 0.78 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి ఎకరం కేటాయించామన్నారు. బసవతారకం క్యాన్సర్ ఫౌండేషన్‌కు గతంలో 15 ఎకరాలు కేటాయించగా, వైద్య కళాశాల నిర్మాణానికి ఇప్పుడు మరో 6 ఎకరాలను కేటాయించామన్నారు. కోస్టల్ బ్యాంక్‌కు 0.4 ఎకరాలు, రెడ్‌క్రాస్ సొసైటీకి- 0.78 ఎకరాలు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల టవర్ల నిర్మాణం, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, మౌలిక వసతుల పూర్తికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. రాజధానిలో 190 ఎంఎల్డీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్‌మెంట్ నిర్మాణానికి, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. జాతీయ రహదారులకు అనుసంధానం చేసేలా ఈ-13, ఈ-15 రోడ్లను పొడిగించేందుకు అథారిటీ నిర్ణయం తీసుకుందన్నా రు. సీడ్ యాక్సిస్ రోడ్డు ఈ-3లో 1.5 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదముద్ర వేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు.

తెలుగు సినిమాల జాబితా పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న సినీ నిర్మాత మురళీమోహన్ తదితరులు

మంగళగిరి, మే 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఆకురాతి శేషాచలం రూపొందించిన తెలుగు సినిమాల జాబితా పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ సినీ నటుడు, నిర్మాత మాగంటి మురళీమోహన్ పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని స్వీకరించారు. తొలి సంపూర్ణ తెలుగు టాకీ భక్త ప్రహ్లాద (1932) మొదలుకుని 2024 డిసెంబరు వరకు అంటే గత 93 సంవత్సరాలలో విడుదలైన దాదాపు 6,302 తెలుగు సినిమాల వివరాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్టు రచయిత శేషాచలం తెలియజేశారు. కార్యక్రమంలో సినీ చరిత్రకారుడు సంజయ్ కిషోర్, ఎస్‌బీఐ విశ్రాంత మేనేజర్ జొన్నలగడ్డ వెంకటకృష్ణ ప్రసాద్, శేషాచలం కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రపరికాలను వినియోగించుకోవాలి

● రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ

దుగ్గిరాల, మే 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యంత్రపరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. దుగ్గిరాల మండలం చిలువూరులోని గ్రామపంచాయతీకార్యాలయం ఆవరణలో జరిగిన మంగళవారం జరిగిన వ్యవసాయ పనిముట్ల పంపిణీలో ఎంపీపీ పాల్గొన్నారు. జబీన్ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందన్నారు. రైతులు పోలిమెట్ల రమేష్‌బాబు, దొడ్డక శేషుకుమారి, తాడిబోయిన అనసూయాదేవిలకు 50శాతం సబ్సిడీపైన ట్రాక్టర్ గొర్రులను, మేళం ఆనంద్‌బాబు, దామర్ల శ్రీనివాసరావులకు సబ్సిడీపై అందించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

పెదనందిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు రమణ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సమ్మెలో పిలుపులో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి కమలాకర్‌కు సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల క్యాంప్

పొన్నూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలను పంపిణీ చేసేందుకు ఈ నెల 7న క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. ఆర్టిఫీషియల్ మేన్యుఫ్యాక్చర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడీఐపీ, ఆర్‌వీ వై పథకం కింద అందించే ఉపకరణాలు సహాయ పరికరాల కోసం జిల్లా పరిషత్ హై స్కూల్‌లోని డీవీసీ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి

తెనాలి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వేపోలీసులు తెలిపారు. పట్టణంలోని ఎడ్లలింగయ్య కాలనీ సమీపంలోని మద్రాసు రైల్వేట్రాక్‌పై మంగళవారం సుమారు 60 నుంచి 67 సంవత్సరాల మధ్య వయస్సుఉన్న వృద్ధుడు ట్రాక్‌పై పడుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడిని తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.



సరస్వతి అలంకారంలో ప్రత్యేక పూజలందుకున్న భావన్నారాయణ

హంస వాహనంపై భావదేవుడు

పొన్నూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం హంస వాహన సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉదయం ఆలయంలో తిరుమంజనోత్సవం నిర్వహించారు. సాక్షి భావన్నారాయణస్వామిని సరస్వతిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హంస వాహనంపై ప్రతిష్ఠించి నగరోత్సవం జరిపారు. పూజ కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలికల కోసం కిషోరి వికాసం

● సెక్టర్ సూపర్ వైజర్ సౌజన్యశ్రీ

తెనాలిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కౌమార దశకు చేరుతున్న బాలికల ఆరోగ్యసమస్యలు, ఇతర ఒడిదుడుకులపై వారిలో అవగాహన పెంపొందించేందుకు కిషోర వికాసం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఐసీడీఎస్ సెక్టర్ వన్ సూపర్ వైజర్ కె.సౌజన్యశ్రీ చెప్పారు. మంగళవారం పట్టణంలోని 18వ వార్డులోని సచివాలయంలో కిషోర వికాసం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రతలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఎమ్మెస్ కె.మాధవి, ఏఎన్ఎం సునీత, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో..

పట్టణంలోని 22వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర వికాసం కార్యక్రమాన్ని సీడీపీవో సునీత అధ్యక్షత సూపర్‌వైజర్ నాగమణి కిషోర బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలువురు చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు, ఏఎన్ఎంలు, ఆషాలు, ఎంఎస్‌కేలు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు వసంతరావు మృతి

పొన్నూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని 23వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వరపర్ల వసంతరావు మంగళవారం మృతి చెందారు. వసంతరావు మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వసంతరావు కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలియజేశారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తోటకూర నరేష్, తదితర టీడీపీ నాయకులు వసంతరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వసంతరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతులు నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలి

● ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాత

కొల్లిపర, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలు పండిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోటలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులు రైతు సదస్సును నిర్వహించారు. రైతు సదస్సులో విద్యార్థినులు వివిధ పంటల సమస్యలపై నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించడం వలన నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. ప్రతిరైతు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. సదస్సులో శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, దయానగ్రీస్, సుజనీరావు, డాక్టర్ వెంకటరాములు పాల్గొన్నారు.



జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో అభివృద్ధి పనులు

○ కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా రూ.80లక్షలతో పనులు
○ వేగంగా వార్డుల్లో మౌలిక సదుపాయాల ఆధునికీకరణ
○ నెలాఖరుకు అందుబాటులోకి తీసుకువస్తాం: సూపరింటెండెంట్

ఆసుపత్రిలో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులు



వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి



మేల్, ఫిమేల్ వార్డుకు వెళ్లే మార్గంలో టైల్స్ వేస్తున్న కార్మికుడు

తెనాలి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వైద్యశాలలకు ఏ మాత్రం తీసిపోకుండా ఉండేలా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల వార్డులు రూపుదిద్దుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వైద్యశాలలోని సమస్యలపై దృష్టిసారించిన వారే లేరు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైద్యశాలలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పేద రోగులకు నాణ్యమైన వైద్యసేవలతో పాటు మౌలిక వసతులు కలిగిన వార్డుల కల్పనే లక్ష్యంగా పనులు చేపట్టారు. దాదాపుగా రూ.80లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులతో ఆసుపత్రి నూతనశోభను సంతరించుకోనుంది. ఆసుపత్రిలో 200మంది ఇన్‌పేషెంట్లు ఉండేలా గతంలో మేల్, ఫిమేల్ జనరల్ వార్డులను దాదాపుగా 25సంవత్సరాల క్రితం నిర్మించారు. ఆ తరువాత వాటి నిర్వహణ పనుల్లో ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతో అనేక సమస్యల నడుమ రోగులు, ఇటు వైద్యసిబ్బంది సతమతమయ్యే పరిస్థితి నెలకొంది. అందులో ప్రధానంగా వార్డుల శ్లాబ్ పెచ్చులు ఊడటం, అపరిశుభ్రంగా టాయిలెట్లు, డోర్లు విరగడం, విద్యుత్ సమస్య, మురుగు పారుదల లేక దుర్గంధం వెదజల్లడం, కింద ఫ్లోరింగ్ కుంగిపోవడం వంటి పలు సమస్యలు వెంటాడేవి. ప్రభుత్వం చేపట్టిన ఆధునికీకరణ పనులతో ఇ సమస్యలు పరిష్కారమవ్వడంతోపాటు వైద్యశాల కార్పొరేట్ ఆసుపత్రుల వార్డులకు ఏమాత్రం తీసిపోని రీతిలో సంతరించుకోనుంది. అంతేకాకుండా ఐసీయూ వార్డు సైతం ఆధునికీకరించి ఇప్పటికే సేవలు ప్రారంభించారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆసుపత్రిలో పనులు ప్రారంభించారు. ముందుగా జనరల్ వార్డులలో ఇన్‌పెషెంట్ల గదుల్లో ఉన్న రోగులను మరో వార్డులోకి తరలించారు. ఆ వార్డులో తొలిగా శ్లాబ్ ప్యాచ్ వర్కులు ప్రారంభించారు. అనంతరం వార్డు కింద భాగంలో కుంగిపోయిన ఫ్లోరింగ్‌ను పగులగొట్టి నూతనంగా ఏర్పాటుచేసి వాటికి టైల్స్ ఏర్పాటుచేశారు. బాత్రూం లనుసైతం పునరుద్ధరించారు. ఐసీయూ, హెచ్‌డీయూ వార్డులలో గతంలో దెబ్బతిన్న ఫ్లోరింగ్‌ను ఇతర పనులను ప్రారంభించి నూతనంగా తీర్చిదిద్దారు. అంతే కాకుండా ఏళ్లనాటి అంతర్గత మురుగు లైన్లను పూర్తిగా తొలగించి నూతన పైప్‌లైన్లు ఏర్పాటుచేసి మురుగు పారుదలయ్యేలా చర్యలు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి గదిలో అగ్నిప్రమాదం సంభవించి నల్లని పొగతో నిరుపయోగంగా మారిన వార్డును ఈ నిధులతోనే నూతనంగా తీర్చిదిద్దారు. టెర్రస్‌లో వాటర్ ప్రూఫ్ కోటింగ్, ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఇప్పటికే ఆర్థో, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, జనరల్ సర్జరీలకు సంబంధించిన నాలుగు ఆపరేషన్ థియేటర్‌లు ఉన్నాయి. అదే ఆవరణలో ఉన్న రికవరీ వార్డును ఆపరేషన్ థియేటర్‌గా మార్చుతూ పనులు చేపట్టారు. దీనిని ఆర్థోపెడిక్ విభాగ సర్జరీల కోసం ఉపయోగించే అవకాశం ఉంది. 108 వాహనాలు నిలుపుకునేలా ప్లాట్‌ఫాం కూడా ఏర్పాటు చేయనున్నారు.

నెలాఖరుకు పూర్తి కానున్న పనులు

తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో ప్రారంభించిన ఆధునికీకరణ పనులు ఈ నెలాఖరుకు పూర్తి కానున్నాయని వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి చెప్పారు. గతంలో వైద్యశాలలో ఉత్పనమవుతున్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు స్పందించి పనులు ప్రారంభించేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో వైద్యశాలలో మేజర్‌గా ఉన్న సమస్యలు పరిష్కారమవ్వనున్నాయని, వార్డులలో తాగునీరు నిరంతరం అందేలా ప్లాంట్‌ను పై అంతస్తుకు మార్చు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నెరవేరని పార్కింగ్ హామీ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన పార్కింగ్‌కు ఏర్పాటు కృషి చేస్తానని ఐదేళ్లు గడిచినా అది ఆచరణలోకి నోచుకోలేదు. అంతేకాకుండా రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తానని చెప్పారు. అది నెరవేరలేదు. పేదలకు ఖర్చుతో కూడుకున్న సిటీస్కాన్ పరికరం మరమ్మతులకు గురై వైద్యసేవలకు ఆటంకంగా ఉన్నప్పటికీ దాని స్థానంలో నూతన స్కానర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఐదేళ్లలో అదికూడా నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంమైనా వీటిపై దృష్టిపెడితే ఆసుపత్రిలో పేద రోగులకు మంచి జరిగే అవకాశం ఉంటుంది.

మేటి పశు సంపద ఒంగోలు జాతి ఎద్దులు

మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే మేటి పశు సంపదగా ఒంగోలు జాతి ఎద్దులు గుర్తింపు పొందాయని మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. వడ్లమూడిలో జరుగుతున్న ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ జాతీయ స్థాయి వృషభ రాజములు బల ప్రదర్శన పోటీలను మంగళవారం నన్నపనేని రాజకుమారి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రారంభించి పశు పోషకులకు బహుమతులు అందజేశారు. సభలో రాజకుమారి మాట్లాడుతూ క్వారీ బాలకోటేశ్వరస్వామి సంగమేశ్వరస్వామి కొలువు దీరిన ప్రాంగణంలో జాతీయ స్థాయి ఎద్దుల పందేలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. పశు పోషణ కష్టతరంగా మారిన నేపథ్యంలో ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. మహిళలకు అందాల పోటలు, తన్నుల పోటీలు, వంటి అనేక పోటీలను నిర్వహిస్తున్న నేపథ్యంలో రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు ఎద్దుల పోటీలను నిర్వహించేందుకు నిధులు అందజేయాలని విజ్ఞప్తిచేశారు. సంగం డెయిరీ స్థాపించడం ద్వారా ధూళిపాళ్ల వీరయ్య చౌదరి రైతుల అభ్యున్నతికి పాటుపడితే ఆయన కుమారుడు నరేంద్రకుమార్ సంగం డెయిరీ ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధికి పాటు పడుతున్నారని కొనియాడారు. మరో అతిథి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పశు పోషణకు ప్రోత్సాహాలు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో 23,500 మినీ గోకులాను పశు పెంపకానికి నిర్మిస్తోందన్నారు. 150ఎద్దుల భారీస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మరో ముఖ్య అతిథి ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ బలప్రదర్శన పోటీలు ద్వారా గ్రామాలకు, రైతులకు మంచి గుర్తింపు వస్తుందని కొనియాడారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పశు సందప భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో భాగం అన్నారు. ఎద్దుల పందేలను నిర్వహించడం ద్వారా అంతరించిపోతున్న పశు సంపదను కాపాడుకోవచ్చన్నారు. ఈ ఏడ్ల పందేలలో సబ్ జూనియర్స్ స్థాయిలో 9 జతలు 1600 కిలోల బండలను లాగి పోటీలలో హోరా హోరీగా తలపడ్డాయి. న్యూ కేటగిరీ విజేతలకు రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, గల్లా మాధవిలు చేతుల మీదగా బహుమతులు అందజేశారు.

అంధకారంలో కొల్లిపర మండలం

● గాలి, వర్షంతో తడిచిన పంటలు ● ఆందోళనలో రైతన్నలు



కొల్లిపరలో గాలితో విరిగిన చెట్ల కొమ్మలు, అంధకారంలో ఉన్న వీధి

కొల్లిపర, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. కొల్లిపర మండలంలో విపరీతంగా గాలులు వేయడంతో విద్యుత్‌ను రెండు గంటలు పాటు నిలిపి వేయడంతో మండలంలో అంధకారం నెలకొంది. మొక్కజొన్న, జొన్న, పసుపు పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు కురియడంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. పలు గ్రామాల్లో మూడు రోజులు నుంచి అకాల వర్షాలు పడటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మంగళవారం రాత్రి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి గాలితో వర్షం పడింది. కల్లాల్లో ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న, జొన్నలు పంటలు పలు చోట్ల పూర్తిగా తడిచిపోయాయి. చేతికి వచ్చిన పంటలు తడిచిపోవడంతో ఎక్కడ దెబ్బతింటాయోమోనని రైతులు ఆవేదనకు గురయ్యారు. మబ్బులు పట్టడంతో కొంతమంది రైతులు హడావిడిగా కల్లాలో ఉన్న పసుపు, మొక్కజొన్న, జొన్నలను గృహాలకు తరలించారు. మరి కొంతమంది రైతులు కల్లాలో ఎండబెట్టిన మొక్కజొన్న, జొన్న, పసుపుపై పట్టాలు కప్పి పంటను రక్షించుకున్నారు. పలుగ్రామాల్లో మొక్కజొన్న, జొన్న పంటలు కోతకోసి పొలంపై అక్కడక్కడ ఆరబెట్టి ఉంచడంతో వర్షానికి తడిచిపోయాయి. వర్షం పడటంతో తడిచిన మొక్కజొన్న, జొన్నలు దెబ్బతింటాయోమోనని రైతులు భయపడుతున్నారు. పట్టాలు కప్పిన పసుపు, మొక్కజొన్న, జొన్నలు కూడా తడవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షంతో పాటు గాలి వేయడంతో మండలంలో పలు చోట్ల అరటి చెట్లుతో పాటు ప్రధాన రహదారిలో చెట్లు పడిపోయాయి. పంట దశకు వచ్చిన అరటి గెలలు పడిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వర్షం కారణంగా ఇటుక పరిశ్రమ రైతులకు ఆపారమైన నష్టం వాటిల్లింది. ఇటుక రాయి తడిచి పోవడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లినట్లు ఇటుక పరిశ్రమ రైతులు తెలుపుతున్నారు.



మౌర్య భూషన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విద్యార్థి మౌర్య భూషన్‌కు కలెక్టర్ ప్రశంస

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే 6 (ఆంధ్రజ్యోతి): నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎద్దు మౌర్య భూషన్‌ను కలెక్టర్ నాగలక్ష్మి ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాల లో విద్యనభ్యసించిన మౌర్య భూషన్ పదో తరగతి పరీక్ష ఫలితాలలో 585 మార్కులు సాధించి ప్రతిభ చూపారు. మౌర్య భూషన్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలును సత్కరించారు.

డాక్టర్ రామమోహన్‌కు సుందరరామయ్య స్మారక గోల్డ్‌మెడల్

తెనాలి అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ దేసు రామమోహన్‌కు డాక్టర్ వి.సుందర రామయ్య స్మారక గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారు. బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో మంగళవారం రాత్రి ఆయన స్మాల్ అండ్ మీడియం హాస్పటల్స్ చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. నేటి వైద్య రంగంలో వస్తున్న అధునాతన మార్పులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసి వివరించారు. ఐఎంఏ అధ్యక్షుడు అనీల్‌కుమార్, ఉపాధ్యక్షురాలు పావనిప్రియాంక, వైద్యులు శ్యాంప్రసాద్, మురళీకృష్ణ, యశ్వంత్ పాల్గొన్నారు.

సీతారామస్వామికి లక్ష మల్లెల పూజ

తెనాలి అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం అంగలకుదురులో శ్రీసీతారామస్వామికి మంగళవారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. వాసు దాసస్వామి పీఠంలో వాల్మీకి రామాయణ యజ్ఞం నిర్వహించారు. సీతమ్మ వారి జయంతి పురస్కరించుకుని అభిషేకాలు, మల్లెపూల అలంకరణ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని సీతారామ దాసస్వామి పర్యవేక్షించారు.

కోర్టు భవనాల పరిశీలన

పొన్నూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని సివిల్, క్రిమినల్ కోర్టులను మంగళవారం జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి పరిశీలించారు. సివిల్ కోర్టు భవనాలు, స్టాఫ్ భవనాలు మరమ్మతులకు గురి కావడం, క్రిమినల్ కోర్టు అద్దె భవనాలలో నిర్వహించడం వంటి సమస్యలను స్థానిక న్యాయవాదులు జిల్లా జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే కోర్టు భవనాలకు స్థల పరిశీలనచేసి నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తి ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు బాజీ సాహెబ్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కోర్టు భవనాలకు స్థల పరిశీలన చేస్తున్న జిల్లా జడ్జి సాయి కల్యాణ్ చక్రవర్తి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● ఆషాడేలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఆషా వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ చెప్పారు. మంగళవారం పట్టణంలోని పాత ప్రభుత్వ వైద్యశాలల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆషా డేను పురస్కరించుకుని ఆషాలతో అన్నపూర్ణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై నిరంతం పర్యవేక్షించే బాధ్యత ఆషా కార్యకర్తలదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా కూడా రక్తహీనత కేసులు నమోదు కాకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు. అదేవిధంగా గర్భధారణ నిర్థారణ అయిన నాటి నుంచి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పౌష్టికాహారం తీసుకునేలా చూడటంతోపాటు ఐరన్ ట్యాబ్లెట్లను కూడా అందిస్తూ సహజ డెలివరీ అయ్యేలా వైద్యుల సూచలతో వారికి అవగాహన కల్పించాలన్నారు. చిన్నారుల ఎదుగుదలపై కూడా ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. బాల్య వివాహాలతో ఏర్పడే అనర్థాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆషా యాప్, రికార్డుల నిర్వహణ, గర్భనిర్ధారణ కిట్లు వాడే విధానం వంటి పలు విషయాలపై ఆషాలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పరిషత్తు క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ క్రిస్టినాను పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులు కలిశారు. కొల్లిపర మండలం మున్నంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి హైస్కూల్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన చొక్కా జీవన్ 587, నలుకుర్తి సుచరిత 583, మున్నంగి మహిమ 580లను జడ్పీ చైర్‌పర్సన్ శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా ఉపాధ్యాయులను, విద్యార్థినుల తల్లిదండ్రులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం, పి.అప్పారావు, ఉపాధ్యాయులు పి.సాంబశివరావు వి.నాగవరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులు, వయోవృద్ధులకు శిబిరం

తెనాలిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధుల ఉపకరణాల సహాయక పరికరాలిచ్చేందుకు గుర్తింపు శిబిరాన్ని ఈ నెల 8న తెనాలి శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషన్న మాట్లాడుతూ రాష్ట్రీయ వయోశ్రీయోజన ద్వారా జిల్లా వయో వృద్ధులకు సహాయ పరికరాల పంపిణీ కోసం భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఉపకరణాల, సహాయక పరికరాల ఉచిత పంపిణీ కోసం గుర్తింపు శిబిరం నిర్వహిస్తోందన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు జిల్లా పరిపాలన యంత్రాంగం సహకారంతో నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సంపద కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సంపద కేంద్రం నిర్మాణానికి స్థల పరిశీలన

కొల్లిపర, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిడపర్తిపాలెంలో తడి చెత్త, పొడి చెత్త సంపద తయారీ కేంద్రం ఏర్పాటుకు మంగళవారం ప్రభుత్వం స్థలాన్ని తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ పిడపర్తిపాలెం పంచాయతీ పరిధిలో తడి చెత్త, పొడి చెత్త సంపద తయారీ కేంద్రం లేనందున ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రభుత్వ స్థలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ నిర్మించటానికి అనుమతులు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో సర్పంచ్ బొల్లు కరుణశ్రీ, ఈవోపీఆర్‌డీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శి మాధురి తదితరులు ఉన్నారు.



పతకాలు సాధించిన చిన్నారులతో వీరవల్లి మురళి తదితరులు

ఫెడరేషన్ కప్ తైక్వాండో పోటీల్లో పతకాలు

తెనాలి అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో తెనాలి బాల బాలికలు ప్రతిభ చూపారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఫెడరేషన్ కప్ కిడ్స్ చాంపియన్‌షిప్ పోటీలు మే 1న జరిగాయి. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పలు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడల్లో పాల్గొన్న తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో క్రీడాకారులు పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. అండర్ 20 కిలోల విభాగంలో షణ్ముఖ్ అభిరామ్, 18 కిలోల విభాగంలో లంకరాజు శిరీష గోల్డ్‌మెడల్ సాధించగా, 24కిలోల విభాగంలో శ్రీశౌర్య బ్రాంజ్ మెడల్ సాధించాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం అకాడమీలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అభినందించారు. కార్యక్రమంలో నాగభూషణం, పోతురాజు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.